





# కొండమల్లేపల్లి ప్రిన్సిపల్ హత్య కేసులో సంచలన విషయాలు

- 'బాబు' అనే ఒక్క మాటతో వీడిన హత్య మిస్టరీ..
- దోపిడీ కోసమే హత్య.. శాస్త్రీయ ఆధారాలతో కేసును ఛేదించిన నల్లగొండ పోలీసులు
- రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్, కత్తి, గ్లౌజులు, మాస్కులు, సెల్‌ఫోన్లు స్వాధీనం





**కొండమల్లేపల్లి, ఆగస్టు19 (నేటి దర్శిని):** కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసును నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. దోపిడీ కోసం పక్కా ప్రణాళికతో హత్యకు పాల్పడిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ముందు రూపారెడ్డి ఫోన్‌లో పలికిన 'బాబు' అనే ఒక్క మాట దర్యాప్తులో కీలక ఆధారంగా మారడం విశేషం. ఈ నెల 11న జరిగిన హత్యను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సవాలుగా తీసుకుని దేవరకొండ డీఎస్పీ ఎం.వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ ఆధారాలు, వేలిముద్రలు, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు 30 కిలోమీటర్ల పరిధిలోని 70 సీసీ కెమెరాల ఫుటేజీని విశ్లేషించి, 80 మందికి పైగా అనుమానితులను విచారించారు.

**'బాబు' అనే మాటతో కీలక మలుపు**

హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతుండగా చివరిగా 'బాబు' అని పలికినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం ఫోన్ స్విచ్ఆఫ్ కావడంతో ఆ మాట ఎవరిని ఉద్దేశించి అన్నారనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. పాఠశాలలో రూపారెడ్డి విద్యార్థులను సాధారణంగా 'బాబు' అని పిలిచేవారని గుర్తించిన పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు. పాఠశాల తిరిగి ప్రారంభమైన తర్వాత విద్యార్థులను ఒక్కొక్కరినీ విచారించగా, కొంతమంది విద్యార్థుల కదలికలపై అనుమానాలు బలపడ్డాయి. సీసీ కెమెరా ఫుటేజీతో వివరాలను సరిపోల్చిన పోలీసులు ఇద్దరు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టారు.

**నగదుతో పట్టుబడిన విద్యార్థులు**

బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో దొనియాల ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌పై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద దాచిన రూ.1.54 లక్షల నగదు గుర్తించారు. అందులోని రూ.500 నోట్లలో కొన్ని రక్తపు మరకలు ఉండటంతో అనుమానం మరింత బలపడింది. విచారణలో ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య చేసి నగదు అపహరించినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.


**మందలించడంతో కక్ష.. సోషల్ మీడియాలో అన్వేషణ**

ఇద్దరు విద్యార్థులు ఒకే హాస్టల్ గదిలో ఉంటూ సోషల్ మీడియా, యూట్యూబ్ ద్వారా సులభంగా డబ్బు సంపాదించే మార్గాలపై అన్వేషించినట్లు పోలీసులు తెలిపారు. గత నెలలో హాస్టల్‌లో డబ్బులతో పట్టుబడిన వారిని ప్రిన్సిపల్ తల్లిదండ్రుల సమక్షంలో మందలించడంతో ఆమెపై కక్ష పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రిన్సిపల్ వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించిన విద్యార్థులు ముందుగా రెక్కీ నిర్వహించి హత్యకు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కత్తి, గ్లౌజులు కొనుగోలు చేసి, ఇంటి వెనుక నుంచి ప్రవేశించి ప్రిన్సిపల్‌పై దాడి చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఇంట్లోని నగదును తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

**భారీగా వస్తువుల స్వాధీనం**

పోలీసులు నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు, మల్లేపల్లి సీఐ ఎ. నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, సంబంధిత ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు. శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయంతో దర్యాప్తు చేస్తే ఎంత క్లిష్టమైన నేరాన్నైనా ఛేదించవచ్చని ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు.

## ఫోటోగ్రాఫర్లు జ్ఞాపకాలను భద్రపరిచే కళాకారులు: నీలం మధు ముదిరాజ్



**పటాన్ చెరు ఆగస్టు 19 (నేటి దర్శిని)** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటో అనేది కేవలం చిత్రం కాదని, ఒక కాలానికి, సంఘటనకు, జ్ఞాపకానికి శాశ్వత సాక్ష్యమని అన్నారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గతంలో తాను చేయించిన హెల్త్ ఇన్సూరెన్స్ తమకు ఎంతో ఉపయోగపడిందని అసోసియేషన్ సభ్యులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

- బీరంగూడ సాయికృపా కాలనీలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పర్యటన






**పటాన్ చెరు ఆగస్టు 19(నేటి దర్శిని)** పటాన్ చెరు నియోజకవర్గం అమీన్పూర్ బీరంగూడ సాయికృపా కాలనీలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో నూతన సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కమ్యూనిటీ హాల్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ఈ పర్యటనలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్, గోపాల్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## తీదేడు యాదవ సంఘానికి నూతన కార్యవర్గం

- అధ్యక్షుడిగా మర్ల యాదగిరి యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



**చింతపల్లి, ఆగస్టు 19 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం వెంకటంపేట (తీదేడు) గ్రామంలో నిర్వహించిన యాదవ సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధితో పాటు సభ్యుల ఐక్యత, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గం అధ్యక్షులు: మర్ల యాదగిరి యాదవ్, ఉపాధ్యక్షులు: దాసరి మల్లయ్య, క్రికెట్: జక్కుల శ్రీను, ప్రధాన కార్యదర్శి: ఉడుత శంకర్ యాదవ్, కార్యదర్శి: దాసరి ముత్తయ్య, సహాయ కార్యదర్శి: కొత్తగొల్ల మల్లయ్య, కోశాధికారి: శివర్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా: ఈడబోయిన ఇద్దమ్మ, ఉడుత మల్లమ్మ, మండే రాములు, మర్ల బచ్చయ్య, దాసరి మల్లేష్, మర్ల మల్లయ్య, బట్టు వెంకటయ్య, జక్కుల రాములు, ఈడమూని శంకర్, గోసుల అంజయ్య, శివర్ల అంజయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మర్ల యాదగిరి యాదవ్ మాట్లాడుతూ.. సంఘ సభ్యులందరినీ కలుపుకొని యాదవ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. యాదవుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని, సభ్యుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. యువతను విద్య, ఉపాధి, క్రీడా రంగాల్లో ప్రోత్సహించడంతో పాటు సామాజికంగా వెనుకబడిన కుటుంబాల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గానికి గ్రామస్థులు, యాదవ సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## చిత్రమే చరిత్రకు సాక్ష్యం..

- ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం
- ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలవాలి
- మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మజు రాఘవేంద్రచారి



**చింతపల్లి, ఆగస్టు19 (నేటి దర్శిని):** మాల్ టౌన్‌లోని పొన్నగంటి కృష్ణ గార్డెన్స్‌లో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను చింతపల్లి, మాల్ టౌన్ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మజు రాఘవేంద్రచారి మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఫోటోగ్రఫీ ద్వారా సేవలందిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన ఫోటోగ్రాఫర్లను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వేల మాటల్లో చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రం ద్వారా చెప్పొచ్చని, ఫోటోలోని గొప్పదనం ఎంతోమందిలో మానవత్వాన్ని మేల్కొలుపుతుందని అన్నారు. "మనం మరణించినా.. మనం తీసిన ఫొటో ఎప్పటికీ సజీవంగానే ఉంటుంది" అని పేర్కొన్నారు. అనంతరం ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రఫీ అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, చింతపల్లి--మాల్ టౌన్ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సందుపట్ల లక్ష్మణ్ సాగర్, కృష్ణగౌడ్, నర్సింగ్, శ్రీనివాస్, సుధాకర్, శంకర్, గిరి, శేఖర్‌గౌడ్, జగన్, నయీమ్, రాజు, మధు, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దశదినకర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్



**నిడమనూరు, ఆగస్టు 19 (నేటి దర్శిని):** నిడమనూరు మండలం నారమ్మగూడెం గ్రామానికి చెందిన కోట సైదులు కుమారుడు కోట కిరణ్ దశదినకర్మ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట కిరణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిక్ష్య నాయక్, రాంఅంజయ్య, బైరెడ్డి సత్యనారాయణ రెడ్డి, గడ్డం సత్యనారాయణ రెడ్డి, నన్నెబోయిన సత్యనారాయణ, లకుమాల మధుబాబు, లకుమాల లింగయ్య, గడ్డం వెంకటేశ్వర్ రెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రావుల సైదులు, కోట రమేష్, కోట రాజు, మాతంగి శ్రీనివాస్, రావుల సుమన్, చిట్యాల శేఖర్ తదితర గ్రామ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

